క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు:మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్దమ్మ తల్లీ దీవించు అంటు అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు మొక్కుగా చెల్లించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

బాలకార్మిక పాఠశాలలో అన్నదానం



అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జిల్లా కేంద్రం నంద్యాలలోని బాలకార్మిక పాఠశాలలో డాక్టర్ పరదేశి ప్రీతి పిలోమినా రాబిన్ ఎబినైజర్ వివాహం సందర్భంగా ఆదివారం సెయింట్ లూక్స్ అంధుల పాఠశాలలో, నందమూరినగర్ బాల కార్మిక పాఠశాలలో చిన్నపిల్లలకు భోజన ఏర్పాటు చేశారు. అంధులను, అనాథ ఆశ్రమాల్లో చదువుకుంటున్న పిల్లలను ఆదుకోవడమే తమ కర్తవ్యమని, తెలుగు ఉభయ రాష్ట్రాల క్రిష్టియన్ జేఏసీ పాస్టర్ మాన్నెం జానయ్య పేర్కొన్నారు.

ఆస్తిలో వాటా ఇవ్వలేదని ఆత్మహత్య

కర్నూలు రూరల్: తండ్రి ఆస్తిలో తనకు వచ్చే వాటా ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. తాలూకా పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగలపాడుకు చెందిన సుజ్ఞానానికి ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య చనిపోయిన తరువాత సుజ్ఞానం రెండో వివాహం చేసుకున్నారు. మొదటి భార్యకు ఒక కుమారుడు సురేష్ ఉన్నారు. రెండో భార్యకు కుమారుడు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. తల్లి చనిపోయిన తరువాత తండ్రి దగ్గరే పెరిగిన సురేష్ తెలంగాణ రాష్ట్రంలోని ఓ ప్రైవేటు బ్యాంకు ఫైనాన్స్‌లో ఉద్యోగిగా పని చేస్తున్నారు. జోగులాంబ గద్వాలకు చెందిన గీతను సురేష్ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటు కుటుంబ పోషణ భారం కావడంతో తండ్రి ఆస్తిలో తనకు వాటాగా వచ్చే ఆస్తిని ఇవ్వాలని కోరగా..అందుకు తండ్రి అంగీకరించకపోవడంతో మనస్తాపం చెందిన తన చావుకు కారణం తన తండ్రేనని, తనకు వాటాగా రావాల్సిన ఆస్తి ఇవ్వడం లేదని లేఖ రాసి శనివారం ఇంటి దగ్గరే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలు పెద్దసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సురేష్ (39) చనిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ నరేష్ తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో కొండచిలువ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం కొండ చిలువ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసింది. సుమారు 11 అడుగుల పొడవు ఉన్న కొండచిలువ గ్రౌండ్‌లెవెల్ వాటర్‌స్టోరేజ్ ట్యాంక్‌లో ఉండింది. ట్యాంకును శుభ్రం చేసేందుకు కూలీలు ట్యాంకులోకి దిగే క్రమంలో ట్యాంక్‌లోకి చూడగా కొండచిలువ కనిపించడంతో భయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న స్నేక్ క్యాచర్స్ డి.రమేష్, ముస్తాక్ కొండచిలువను పట్టుకొని అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం

కర్నూలు కల్చరల్: సనాతన ధార్మిక జీవనమే విశ్వ కళ్యాణ కారకమని పలువురు వక్తలు అన్నారు. కర్నూలు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఆదివారం హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాకలూరు శారదా పీఠం అధిపతి శివ యోగేంద్ర సరస్వతి, జూటూరు శ్రీ గురు సిద్ధ నాగసాయి బ్రహ్మ విద్యాశ్రమం పీఠాధిపతి శ్రీ సద్గురు రామానంద స్వామి, భగవాన్ ధన్వంతరి యోగాశ్రమం నిర్వాహకులు డాక్టర్ పద్మానంద యోగి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, నల్లగుట్ట శ్రీకూర్మం క్షేత్రం నిర్వాహకులు నరేష్, స్వాత్మానంద స్వామి తదితరులు పాల్గొని మాట్లాడారు. ధార్మిక సంస్థల్లో అంతర్గత అనైక్యతను పోగొట్టడానికి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలన్నారు. పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ చేపట్టాలన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విశ్వశాంతిని ఆకాక్షించే ధర్మం సనాతనం అని, ధర్మాన్ని అవలంభించినప్పుడే విశ్వ కల్యాణం సాకారం అవుతుందన్నారు. కర్యక్రమ సమన్వయకర్తగా డాక్టర్ తొగట సురేష్‌బాబు వ్యవహరించారు.



చాగలమర్రిలోని ఓ వ్యాపారి దుకాణంలోకి విత్తనాలు చేర్చుతున్న దృశ్యం



బయట దుకాణంలో వరి విత్తనాలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్న రైతు

కష్టాల ఖరీఫ్!

- జోరందుకున్న సాగు
- గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువుల పంపిణీ
- నేడు కానరాని పరిస్థితి
- సొమ్ము చేసుకుంటున్న విత్తన వ్యాపారులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

చాగలమర్రి: గతేడాది సరిగ్గా పంటలు పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం కూడా పట్టనట్టు వ్యవహరించింది. పైసా సాయం అందించలేదు. కనీసం ఎన్నికల ముందు ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదు. దీంతో దిక్కుతోచని రైతులు అప్పులు చేసి మరోసారి ఖరీఫ్ సీజన్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే సీజన్ ప్రారంభమై నెల కావడంతో పంటల సాగు పనులు ముమ్మరం చేశారు. చాగలమర్రి మండలంలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2 వేల హెక్టార్లు కాగా ఇందులో కేసీకెనాల్, తెలుగు గంగ కాల్వ కింద దాదాపు 1000 హెక్టార్ల వరకు ఉంటుంది. మిగతాది బోరు బావులు, చెరువులు, కుంటల కింద సాగవుతుంది.

విత్తనం గుట్టు దేవుడికే ఎరుక

మండలంలో ఎక్కువగా వరి, మినుము, మొక్కజొన్న, కంది, నిమ్మ, బొప్పాయి పంటలు సాగు చేస్తారు. ప్రస్తుతం ఆయా పంటల విత్తనాల కోసం రైతులు దుకాణాలకు పరుగులు తీస్తున్నారు.గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విత్తనాలు, ఎరువుల కొరత ఉండేది కాదు. ఖరీఫ్ సీజన్‌కు ముందే ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం వాటిని అందించేది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితి లేదు. బయట మార్కెట్లోనే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. దీనిని విత్తన వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా విత్తనాలకు ధరలు నిర్ణయించి విక్రయిస్తున్నారు. వాటి నాణ్యత దేవుడికే ఎరుక. ఎందుకంటే వ్యవసాయాధికారుల పర్యవేక్షణ లేదు. తనిఖీలు లేవు. దీంతో కొందరు వ్యాపారులు నాసిరకం విత్తనాలు తీసుకొచ్చి రైతులకు అంటగడుతున్నారు. గతేడాది కొన్ని రకాల పంటలు ఆశించిన మేర దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇందుకు విత్తనం నాణ్యత లేకపోవడమే కారణమనే విమర్శలు ఉన్నాయి. ఈసారి ఆ పరిస్థితి రాకుండా వ్యవసాయాధికారులు తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



పెద్దవంగలి గ్రామంలో ఖరీఫ్ సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు నర్సయ్య

విత్తనాలు, ఎరువుల పంపిణీ లేదు



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత ఏర్పడింది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో మేము ఎక్కువగా మొక్కజొన్న, వరి, మినుము, శనగ, కంది సాగు చేస్తాము. అయితే, ఈపంటల విత్తనాలను ప్రభుత్వం పంపిణీ చేయక పోవడంతో బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయవలసి వస్తుంది. అధిక ధర చెల్లించినా విత్తనాలు నాణ్యతగా ఉన్నాయో లేదో తెలియదు. – సుబ్బారాయుడు, రైతు, ముత్యాలపాడు గ్రామం, చాగలమర్రి

గతేడాది కలిసిరాని ఉద్యాన పంటలు

చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి, పెద్దవంగలి, ముత్యాలపాడు, మల్లెవేముల తదితర గ్రామాల్లో రైతులు ఉద్యాన పంటలైన మామిడి, నిమ్మ, బొప్పాయి, అరటి తదితర పంటలు సాగు చేశారు. అయితే, గతేడాది గిట్టుబాటు ధరలు లేక పోవడంతో ఆయా పంటలను తొలగించారు. ధర లేక నిమ్మ దిగుబడులను దిబ్బల్లో పారవేశారు. గతేడాది జరిగిన నష్టంతో ఈసారి ఉద్యాన పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపించడం లేదు.

నేడు పీజీఆర్ఎస్

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సువర్ణాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలి పారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

విద్యుత్ బిల్లుల వసూళ్లు వేగవంతం చేయాలి

గోస్పాడు: వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లుల వసూళ్లను వేగవంతం చేయాలని ఏఈ జ్ఞానసూర్యుడు అన్నారు. స్థానిక సబ్‌స్టేషన్‌లో ఆదివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని సూచించారు. గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పించి బిల్లులు త్వరితగతిన చెల్లించేలా చూడాలని తెలిపారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నంద్యాల(అర్బన్): వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చి ఆదుకోవాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేరుస్తూ గతంలో రాష్ట్ర మంత్రి వర్గ తీర్మానం చేసి ఆమోదానికి పార్లమెంట్‌కు పంపిందన్నారు. అయితే, ఇంకా కార్యరూపం దాల్చలేదని చెప్పారు. మరోసారి వడ్డెర్లకు సంబంధించిన బిల్లును అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాలన్నారు.

104 సేవలకు గ్రహణం



చాగలమర్రి పీహెచ్‌సీలో 104 వాహనం

చాగలమర్రి: గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన 104, 108పై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ సేవలను గతంలో అరబిందో ఫార్మ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహిస్తుండగా కూటమి ప్రభుత్వం వచ్చాక భవ్య హెల్త్ సర్వీసెస్‌కు అప్పగించింది. అయితే, ఈ సంస్థ సేవల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుంది. చాగలమర్రి మండలంలో ఇదివరకు 104 అంబులెన్సు ద్వారా ప్రతి గ్రామానికి నెలకు రెండు సార్లు వెళ్లి అక్కడి ప్రజలకు వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించేవారు. అయితే, ప్రస్తుతం ఈ సేవలు కుంటుపడ్డాయి. 104 వాహనానికి సంబంధించిన బ్యాటరీ మరమ్మతులకు గురైంది.ఈ సమస్య తలెత్తి ఏడాది అవుతున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం



వైఎస్సార్‌సీపీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి
- స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి
- కార్యకర్తలను విస్మరించే ప్రసక్తే లేదు
- ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్
- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

కల్లూరు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గ్రామ స్థాయిలో ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని వైఎస్సార్ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడులోని ఓ ఫంక్షన్ హాల్‌లో కల్లూరు గ్రామీణ, కల్లూరు అర్బన్ వార్డుల మండల స్థాయి విస్తృతస్థాయి సమావేశంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. పార్టీలో రాష్ట్ర, జిల్లా, మండల విభాగాల్లో పదవులు పొందిన వారు, అర్బన్ 16 వార్డులు, గ్రామీణ మండ లం ప్రాంతం నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని కాటసాని స్పష్టం చేశారు. గోరుకల్లు రిజర్వాయర్‌ను టీడీపీ నాయకులు తీసుకొచ్చినట్లు చెప్పుకుంటున్నారని, ఎవరి కాలంలో ప్రాజెక్టు శంకుస్థాపన జరిగిందో, ఎవరు ప్రారంభించారో ఇరిగేషన్ శాఖ రికార్డులను పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. వైఎస్సార్ హయాంలోనే గోరుకల్లు, హంద్రీనీవా, గాలేరు నగరి, ఎస్‌ఆర్‌బీసీ, గోరుకల్లు రిజర్వాయర్ ప్రాజక్టులను తీసుకొచ్చారని గుర్తు చేశారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

ఎన్నికల సమయంలో అలవిగాని హామీలు ఇచ్చి సీఎం చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, కూటమి ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని కాటసాని చెప్పారు. ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల ప్రతి కుటుంబం ఎంత నష్టపోయిందో ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి 'బాబు ష్యూరిటీ – భవిష్యత్ గ్యారెంటీ' అని బాండ్లు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగాలు వచ్చే వరకు భృతి ఇస్తామని, రైతులకు అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం , ఆడబిడ్డ నిధి వంటి పథకాలు ఇస్తామని ప్రగాల్భాలు పలికారని గుర్తు చేశారు. పొదుపు మహిళలకు రూ.10 లక్షలు బ్యాంకు లోన్ ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గోరుకల్లు రిజర్వాయర్‌కు గేట్లు ఏర్పాటు చేసి, 11 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో గత ఐదేళ్లు రైతులకు సాగు, తాగు నీరు అందించామన్నారు.

స్థానిక ఎన్నికలపై దృష్టి

రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సత్తా చూపుదామని కాటసాని శివనరసింహారెడ్డి అన్నారు. నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాస్తున్నారని వాటికి భయపడే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వ హామీలపై ప్రజల తరఫున పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ రేణుక, కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి కొనసాగుతున్న సాగునీటి విడుదల

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నాలుగు గేట్ల నుంచి ఎస్సార్‌ఎమ్సీ కాల్వలోకి సాగు నీటి సరఫరా కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో శ్రీశైలం డ్యాంలో 883.30 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 882.30 అడుగులు నమోదైనట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2,4,5,6 గేట్ల నుంచి గత నాలుగు రోజుల నుంచి 20వేల క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటి నియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 15వేల క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు 5వేల క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఎస్సార్బీసీ కాల్వకు సాగునీరివ్వండి

ఇప్పటిదాకా ఎస్సార్బీసీ కాల్వకు సాగునీటిని సరఫరా చేయకపోవటంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు కింద సాగుచేసిన పంటలు వర్షాభావ పరిస్థితులు, సాగునీరు అందక పైర్లు ఎండు మొహం పట్టాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సత్వరమే ఎస్సార్బీసీ కాల్వకు సాగునీటి నివ్వాలని కోరారు.

నేడు పాములపాడుకు చేరనున్న కేసీ నీరు

కర్నూలు–కడప కాల్వకు విడుదల చేసిన సాగునీరు సోమవారం సాయంత్రానికి పాములపాడు చేరే అవకాశం ఉందని కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 500క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, దానిని క్రమేణా వెయ్యి క్యూసెక్కులకు పెంచుతారన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి సుంకేసుల డ్యాంలోకి వచ్చే ఇన్‌ఫ్లోను బట్టి 2వేల క్యూసెక్కుల వరకు పెంచే అవకాశాలున్నాయన్నారు. లాకిన్స్ లాకు నీళ్లు చేరిన తర్వాతనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతుల డిమాండ్‌ను అనుసరించి నిప్పుల వాగు, తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు సాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

నంద్యాల రచయితలకు సత్కారం

నంద్యాల(వ్యవసాయం): కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాష్ట్ర స్థాయి తెలుగు భాష సదస్సు నిర్వహించారు. తెలుగు భాష వికాస ఉద్యమం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నంద్యాల పట్టణానికి చెందిన తెలుగు పండితులు రచయితలు అన్నెం శ్రీనివాస రెడ్డి, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, మహమ్మద్ రఫీ సత్కారం అందుకున్నారు. 'మాతృభాషగా తెలుగు, అధికార భాషగా తెలుగు' అనే అంశాలపై వారు సదస్సులో ప్రసంగించారు.

నేటి నుంచి కార్మెల్ మాత ఉత్సవాలు

నంద్యాల (న్యూటౌన్): గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగే కార్మెల్ ఉత్సవాలను జయప్రదం చేయాలని నంద్యాల ఆర్‌సీఎం ఫాదర్ బాలకిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మెల్ కొండపైన కొలువైన కార్మెల్ మాత ఉత్సవాలు 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఇక్కడి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.

ముగిసిన యుదా సువార్త పండుగలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని క్రాంతినగర్ సమీపంలో ఉన్న పెంతెకోస్తు ఆలయంలో రెండు రోజులుగా జరుగుతున్న యుదా సువార్త పండుగలు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపాలపురానికి చెందిన దైవజనులు డి.దాసన్న మాట్లాడుతూ శాంతి సమాదానం, ప్రేమ గుణంతో క్రైస్తవులు సమాజంలో ముందుకెళ్లాలన్నారు. ఐకమత్యంతో క్రీస్తు అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో క్లయిమెంట్ డాక్టర్ విజయ్‌మోహన్, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు స్థలంలో ఉర్దూ కళాశాల నిర్మించాలి

నంద్యాల(అర్బన్): స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లో ఉన్న మసీదు స్థలం (వక్ఫ్‌బోర్డు స్థలం)లో ఉర్దూ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు చేయాలని అవాజ్ జిల్లా కార్యదర్శి మస్తాన్‌వలి కోరారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్‌లోని వక్ఫ్‌బోర్డు స్థలంపై మంత్రి ఫరూక్, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా చర్చించి ముస్లింలకు ఉపయోగకరమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఉర్దూ కళాశాల, వ్యాపార సముదాయం, ముస్లిం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలోని కేశవ, రామచంద్ర, ఆంజనేయ స్వామి దేవస్థాముల ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఈఓ వెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చైర్మన్‌తో పాటు మరో తొమ్మిది మంది కమిటీ సభ్యుల పదవులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్ ప్రకారం చైర్మన్ ఓసీ, 9 మంది సభ్యులు ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఒక్కొక్కరు చొప్పును మహిళలు, బీసీ నాయీ బ్రాహ్మణ, ఓసీ బ్రాహ్మణ, ఓసీ ఇద్దరు పురుషులు ప్రకారం కమిటీలో ఉండాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీలోపు నంద్యాలలోని రైతునగరంలో ఉన్న దేవదాయ శాఖ కార్యాలయంలో అర్హులైన వారు తమ దరఖాస్తు పత్రాలు అందజేయాలన్నారు.

అడిగిన వారందరికీ 'ఉపాధి'



గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

చాగలమర్రి: గ్రామాల్లో అడిగిన ప్రతి వ్యవసాయ కూలీకి ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు ఉపాధి అధికారులు అన్నారు. మండలంలోని కదిరిపురం తండాలో ఆదివారం సర్పంచ్ రామ్లీబాయి అధ్యక్షతన సమాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించిన తనిఖీ నివేదికను ఎస్ఆర్‌పీ భాస్కర్, డీఆర్‌పీ ఉరుకుందలు చదివి వినిపించారు. గ్రామంలో 166 మందికి జాబ్ కార్డులు ఉండగా వారందరికీ పనులు కల్పించడం జరిగిందన్నారు. అదే విధంగా 30 పనులకు సంబంధించి రూ.32,19,132 వేతనాలు , రూ.55,192 మెటీరియల్ రూపంలో మంజూరైనట్లు తెలిపారు. 166 మందిలో 73 మందికి 100 రోజుల పనులు కల్పించినట్లు వెల్లడించారు. కొంతమంది పనులకు రాకుండ డబ్బులు తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలకు ఆధారాలు లేవన్నారు. ఈ గ్రామ సభలో ఏపీఓ నిర్మల, టెక్నికల్ అసిస్టెంట్ బాలానాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్‌నాయక్, సచివాలయ సిబ్బంది, మేట్లు, జాబ్ కార్డుదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సేవలను విస్తృతం చేయాలి



ప్రమాణస్వీకారం చేసిన లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గంతో అతిథులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల లయన్స్ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి అన్నారు. 2025– 26వ సంవత్సరానికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం స్థానిక బాలాజీ కల్యాణ మండపంలో నిర్వహించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా సోమేశుల నాగరాజు, కార్యదర్శిగా తాతిరెడ్డి భాస్కర్ రెడ్డి, కోశాధికారిగా అమిదేల జనార్దన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు డాక్టర్ రవికృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లయన్స్ క్లబ్ సమాఖ్య మాజీ చైర్మన్ ఏవీఆర్ ప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య దర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి, నంద్యాల బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధులు పాల్గొని మాట్లాడారు.

వైద్యుల దినోత్సవ పురస్కారాల ప్రదానం

అతిథుల చేతుల మీదుగా నంద్యాల లయన్స్ క్లబ్ వైద్యుల దినోత్సవ పురస్కారాలను డాక్టర్ పెసల అశోక్, డాక్టర్ పెసల సునీత, డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ జహంగీర్, డాక్టర్ క్రాంతి చైతన్య, డాక్టర్ శైలజలకు అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ పి.వి.సుధాకర్ రెడ్డి, భవనాసి నాగ మహేష్, కొట్టె వేణుమాధవ్, కొట్టె చంద్రశేఖర్, స్వామి రెడ్డి, చంద్రమోహన్, రమణయ్య, అధిక సంఖ్యలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నిండుకుంది!



ఉయ్యాలవాడలో పాలూరు సుబ్బరాయుడు కుంటలో కలుషిత నీరు

ఉయ్యాలవాడ: ఎన్నో ఏళ్లుగా గ్రామ ప్రజల దాహార్తి తీర్చిన నీటికుంట నేడు కలుషిత నీటితో నిండిపోయింది. అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రమైన ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో వందేళ్ల క్రితం స్వర్గీయ పాలూరు సుబ్బరాయుడు శ్రేష్టి నీటి కుంటను ఏర్పాటు చేశారు. సుమారు 50 సెంట్ల విస్తీర్ణంలో ఈ కుంట నిర్మాణం జరిగింది. నాటి నుంచి 2004వరకు గ్రామ ప్రజల దాహార్తీ తీరుస్తూ వచ్చింది. సమీపంలోని హైస్కూల్, బీసీ, ఎస్సీ వసతి గృహాల్లోని విద్యార్థుల తాగునీటి అవసరాలు తీర్చింది. అయితే, నేడు అధికారుల నిర్లక్ష్యంతో కుంటలో నీరు పూర్తిగా కలుషితమైపోయింది. కుంట ఆవరణ చుట్టూ ముళ్ల పొదలు, అపరిశుభ్రత పేరుకుపోయింది. నాడు ఎంతో పకడ్బందీగా నిర్మించిన తాగు నీటి కుంటను ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పూడిక, ముళ్లపొదలు తొలగించి వినియోగంలోకి తీసుకరావాలని గ్రామస్తులు కోరుతున్నారు.